ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

మద్దిరాల, జూన్ 30 : మండలాధికారులు అంకితభావంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్రావెంకన్న అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందని, వర్షాకాలంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ఈ నెల 4తో ముగుస్తుండటంతో వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఐదు సంవత్సరాలుగా వారు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బెజ్జెంకి శ్రీరాంరెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

మద్దిరాల మండలంలోని మామిండ్ల మడవ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసంపెల్లి వెంకటరెడ్డి తండ్రి రాంరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే సామేల్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీపీఐ నుంచి సీపీఎంలో చేరిక

మోత్కూరు, జూన్ 30 : మండలంలోని ముశిపట్లకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు పైళ్ల యాదిరెడ్డి ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ సమక్షంలో మార్క్సిస్టు పార్టీలో చేరారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతున్న సీపీఎం విధానాలను ఆకర్శితులై చేరుతున్నట్లు యాదిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు అనూరాధ, నర్సింహ పాల్గొన్నారు.

గౌడ హక్కుల సాధనకు పోరాటం చేయాలి

- గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్

గుండాల, జూన్ 30 : గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని రామారం గ్రామంలో ఆదివారం గౌడ కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. వైన్స్ టెండర్లలో గౌడ కులస్తులకు 25శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి చౌగోని శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షుడు తీగల రంగన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీసు సోమన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సూదగాని రామచంద్రయ్య గౌడ్, భిక్షపతి గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), జూన్ 30 : అర్హులకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6నెలల క్రితం ప్రజా పాలనలో రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు నిరుత్సాహంతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తుమ్మల సత్యనారాయణరెడ్డి, ఎరుకల పాపయ్యగౌడ్, సామ శ్రీనివాస్‌రెడ్డి, అఖిలేశ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకూ రైతుభరోసా వర్తింపజేయాలి

- పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి
- రైతుభరోసాపై రైతుల అభిప్రాయాల సేకరణ

ఆత్మకూర్.ఎస్: సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి

ఆత్మకూర్ ఎస్, జూన్ 30 : రైతులతో పాటు కౌలు రైతులకూ రైతుభరోసా వర్తింపజేయాలని పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని నెమ్మికల్ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన పీఏసీఎస్ ఏపూర్ శాఖ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగు చేయని భూములకు, ఓపెన్ ప్లాట్‌లకు రైతుబంధు తొలగించాలన్నారు. 10 ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ వర్తింపజేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనకు సమావేశానికి హాజరైన రైతులందరూ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ గజవెల్లి శ్రీనివాస్, ఏఓ దివ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆశోక్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, సీఈఓ పట్నం లక్ష్మారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సిరికొండ పీఏసీఎస్‌లో..

మోతె : మండలంలోని సిరికొండ పీఏసీఎస్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా సూర్యాపేట డీసీఓ పద్మ మాట్లాడుతూ పది ఎకరాలలోపు వారికి రైతు భరోసా పథకం వర్తింపజేయాలని కొంతమంది రైతులు అభిప్రాయపడినట్లు తెలిపారు. ప్లాట్లకు, గుట్టలకు కాకుండా సాగుచేసే భూములకే పథకం అందజేయాలని రైతులు తెలిపినట్లు పేర్కొన్నారు. పీఎసీఎస్ చైర్మన్ కొండపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు విత్తనాలతో పాటు ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, ఏఈఓలు కార్తీక్, మధుసూదన్‌రెడ్డి, సీఈఓ బాణాల అనంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సాగు చేసిన భూమికి కల్పించాలి

పాలకవీడు : సాగు చేసే మొత్తం భూమికి రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని పలువురు రైతులు అభిప్రాయపడినట్లు హుజూర్‌నగర్ ఏడీఏ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక మహాజన సమావేశంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సాగు చేసే రైతులకు మాత్రమే పథకాన్ని వర్తింపజేయాలని రైతులు తెలిపారని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో ఏఓ శ్రీనివాస్, సీఈఓ వెంకటరెడ్డి, ఏఈఓలు వెంకటేశ్, శారద, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాలకవీడు: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సంధ్యారాణి

మోతె : సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ పద్మ

నేడు రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

నేరేడుచర్ల, జూన్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకంపై సోమవారం నేరేడుచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాల సేకరణకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దొండపాటి అప్పిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పీఏసీఎస్ ఆవరణలో నిర్వహించే కార్యక్రమానికి రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలుపాలని కోరారు.

సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగూనాయక్

చివ్వెంల, జూన్ 30 : సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా చివ్వెంల మండలం మొగ్గయ్య గూడెం గ్రామానికి చెందిన భూక్య నాగూనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాగూనాయక్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగూనాయక్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

యూత్ జిల్లా అధ్యక్షుడిగా బాలూనాయక్

మఠంపల్లి, జూన్ 30 : సేవాలాల్ యూత్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని లాలితండాకు చెందిన భూక్య బాలూనాయక్ ఎన్నికయ్యాడు. కోదాడలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో సేవాలాల్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ ఆదేశాల మేరకు రాష్ట్ర కన్వీనర్ మాళోతు సైదానాయక్ ఉత్తర్వులు అందించినట్లు బాలూనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీనివాస్‌కు బుద్ధ పూర్ణిమ జాతీయ పురస్కారం

అవార్డు అందుకుంటున్న కర్ల శ్రీనివాస్

మఠంపల్లి, జూన్ 30 : తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వారు భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా అందించిన మహానంది బుద్ధ పూర్ణిమ జాతీయ పురస్కారాన్ని మఠంపల్లికి చెందిన కవి, గాయకుడు కర్ల శ్రీనివాస్ అందుకున్నారు. జానపద కళారంగంలో చేస్తున్న కృషికి ఆయనకు అవార్డు అందించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

గురునాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మేళ్లచెరువు, జూన్ 30 : మండల కేంద్రంలోని గురునాథ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సీతయ్య, రామారావు, సురేశ్, అశోక్, గోపి పాల్గొన్నారు.

మాదిగ దండోర రజతోత్సవాలను విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం), జూన్ 30 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జూలై 7న జరుగనున్న మాదిగ దండోర 30 సంవత్సరాల రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రజతోత్సవాల ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి వెంకట్, ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరె నవీన్, రవీందర్, అనిల్, అశోక్, గిరి, రవి, మత్స్యగిరి పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందజేత

అడ్డగూడూరు, జూన్ 30 : మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు దెబ్బతిన్న నిరుపేదలు సుత్తోజు వీరాచారి, బాకి చంద్రమ్మకు రెడ్‌క్రాస్ సంస్థ నుంచి టార్పాలిన్ పట్టాలను ఆదివారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, నాయకులు తోట కృష్ణారెడ్డి, తోట భాస్కర్‌రెడ్డి, మందుల కిరణ్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయాలి

- సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, జూన్ 30 : అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను తక్షణమే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బోడల్‌దిన్న గ్రామంలో జరిగిన పార్టీ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 7 నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు తెల్ల రేషన్ కార్డులు తప్పనిసరిగా కావాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు కొమ్మరాజు వెంకట్, రైతుసంఘం నాయకులు ఎల్లబోయిన వెంకన్న, నరసయ్య పాల్గొన్నారు.

ప్రక్రియను ప్రారంభించాలి : సీపీఎం

గరిడేపల్లి : అర్హులందరికీ ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన చాలా మంది కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే కార్డుల దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు.

పండ్ల మొక్కల సీడ్ బాల్స్ విసురుతున్న కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్

సూర్యాపేట రూరల్, జూన్ 30 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్, కార్యదర్శి సట్టు రామకృష్ణ అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట మండలం జనగాం క్రాస్ రోడ్డు రాజానాయక్ తండానుంచి గాంధీనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా పండ్లు, నీడనిచ్చే మొక్కల సీడ్ బాల్స్‌ను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం తప్పనిసరి అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డీజీఎస్ రవి, కేలోతు, ఆర్ఎస్ విక్రమ్‌రాజ్, డీఎం ఫణింద్ర కుమార్, సీఎం షర్వాణన్, ఎస్ఎం వెంకటరమణ, మేనేజర్ నిరంజన్, వెంగల్‌రావు, బాలాజీ పాల్గొన్నారు.

లక్ష్మణ్‌రావు విగ్రహావిష్కరణలో శాసన మండల చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్యే బాలూనాయక్, మాజీ మంత్రి జానారెడ్డి

మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- అంగడిపేట స్టేజీ వద్ద విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ సీఎల్పీనేత జానారెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 30 : మండలంలో సాగు,తాగు నీటి సాధనకు, పేద ప్రజలకు కోసం దివంగత నేత మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ కటికనేని లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడిపేట స్టేజీ వద్ద ఆయన 80 జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు సాధనలో ఆయన పాత్ర కీలక పాత్ర పోషించారన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి అని కొనియాడారు. మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్ మాట్లాడతూ జల సాధన సమితి ద్వారా ఈ ప్రాంత ప్రజలను సాగునీటి సాధనలో చైతన్య తీసువచ్చిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాస్కర్‌రావు, చందర్‌రావు, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అల్లంపల్లి నర్సింహ, దుశ్చర్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ తేరా సత్యనారాయణరెడ్డి, నాయకులు వీరమోని యల్లయ్య, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్, వీరమోని యల్లయ్య, మాధవరావు, తోటకూరి పరమేశ్ , పాండురంగారావు ఉన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

కట్టంగూర్ : పీఏసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

తిప్పర్తి : సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి

- డీఏఓ శ్రవణ్‌కుమార్

కట్టంగూర్, జూన్ 30 : రైతు భరోసా అమలుపై పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాల్లో రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని డీఏఓ పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణలో భాగంగా ఆదివారం కట్టంగూర్, కేతేపల్లి పీఏసీఎస్ కార్యాలయాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సాయం నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు అభిప్రాయాలను సేకరిస్తునట్లు తెలిపారు. 43 పీఏసీఎస్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తునట్లు చెప్పారు. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా అమలు చేయాలని సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆయా కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, కట్టంగూర్ పీఏసీఎస్ కార్యదర్శి బండ మల్లారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులు శివరాంకుమార్, బి.పురుషోత్తం, క్లస్టర్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌కుమార్, ఏఈఓలు పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

60 మంది రైతుల అభిప్రాయాలు సేకరించాం

- కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్

నకిరేకల్ : తాటికల్ సహకార పరపతి సంఘం నుంచి రైతుబంధుపై 60 మంది రైతుల అభిప్రాయాలు సేకరించినట్లు కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్ తెలిపారు. నకిరేకల్ మండలంలోని పీఏసీఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 10 ఎకరాల వరకూ రైతుబంధు ఇవ్వాలని, సాగుచేస్తున్న వారికే రైతు బంధు ఇవ్వాలని అధికారులను కోరారు. సమావేశంలో కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహమూద్ అలీ, ఏఈఓ వల్లెపు నాగరాజు, సీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు సామ సత్తిరెడ్డి, మేడే లింగయ్య, నూకల యశోద, సిబ్బంది శీలం నాగరాజు, అభిమన్యు, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

తిప్పర్తి : రైతు భరోసా పథకం పై సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైతు వేదికలో రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా మెజార్టీ రైతులు మాత్రం పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేశ్, నాయకులు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, సీఈఓ వైస్ చైర్మన్ కందుల రేణుక, డైరెక్టర్లు గోదాకృష్ణారెడ్డి, ఏఈఓ పాల్గొదన్నారు.

విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

రామగిరి, జూన్ 30 : విశ్వ బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ జేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజంతో సేవా సంస్థ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎస్పీ టి.రాజశేఖర్ మాట్లాడుతూ వివాహ బంధం విశిష్టత ను వివరించారు. అనంతరం పరిచయ వేదికకు హాజరైన వధూవరుల ఫొటోలతో బయోడేటా ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రదర్శన చేసి పరిచయ కార్యక్రమం చేపట్టారు. వివిధ జిల్లాల నుంచి వధూ వరుల తల్లిదండ్రులు హాజరయ్యారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గడగోజు చంద్రశేఖర్, కొండోజు కృష్ణమాచారి, అన్నభీమోజు నాగార్జునా చారి, పెండోట సోము, పగిడిమర్రి వెంకటాచారి, సిరసనగండ్ల ఈశ్వరాచారి, కొండోజు మల్లికార్జునచారి, తాడోజు శ్రీనివాసాచారి, నారాబత్తుల శ్రీనివాసాచారి, బొడ్డుపల్లి రామకృష్ణ, కొండోజు కృష్ణామాచారి పాల్గొన్నారు.

వైద్యంలో నిర్లక్ష్యం వహించిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మిర్యాలగూడ, జూన్ 30 : కంటి ఆపరేషన్‌లో నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలిగుర్రంపోడు మండలానికి చెందిన బొంత అంజయ్య ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన భార్య వెంకటమ్మ కుడి కంటిలో కురుపు కావడంతో వైద్య చికిత్స కోసం మిర్యాలగూడలోని రాఫా కంటి దవాఖానకు వెళ్లగా ఈనెల 16న వైద్యులు ఆపరేషన్ చేసి కురుపును తొలగించారు. కాగా ఆపరేషన్ చేసే సమయంలో బీపీ, ఆరోగ్య పరిస్థితిని చెకప్ చేయకుండానే ఆపరేషన్ చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి ఎడమ కాలు, చెయ్యి పడిపోయింది. వెంటనే మెరుగైన చికిత్స కోసం నల్లగొండలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి హైబీపీతో మెడ నరాలు చిట్లి మెదడులో రక్తం గడ్డ కట్టిందని సర్జరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆమె పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు స్పందించి ఆపరేషన్‌లో నిర్లక్ష్యం వహించిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మహిళా మృతదేహానికి పోస్టుమార్టం

- ఐదు రోజుల క్రితం అంత్యక్రియలు

మిర్యాలగూడ, జూన్ 30: చనిపోయి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం ఓ మహిళా మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. రూరల్ ఎస్ఐ నరేశ్. తెలిపిన వివరాల ప్రకారం..అవంతీపురం గ్రామానికి చెందిన శివనేని అరుణ (43) ఏడాదిన్నర కాలంగా యాద్గార్‌పల్లి శివారులోగల ఎస్ఎంఎస్ 9 ఆగ్రో ఆయిల్ మిల్లులో బస్తాలు కుట్టి కూలీ పనులు చేస్తున్నది. మే 31న మిల్లు వద్ద అస్వస్థతకు గురికావడంతో మిల్లు యాజమాన్యం ఆమెకు మిర్యాలగూడ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కూడా విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా ఆరోగ్య విషమించి ఈనెల 25న అరుణ మృతిచెందింది. కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మృతురాలి కుమారుడు ప్రేమ్‌కుమార్ మిల్లులో పని చేయడం వల్ల తన తల్లికి శ్వాస సంబంధాలు ఏర్పడ్డాయని, మిల్లు యాజమాన్యం సకాలంలో చికిత్స చేయించకపోవడం వల్ల తల్లి మృతి చెందిందని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో మిర్యాలగూడ తాసీల్దార్ హరిబాబు సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని వెలికితీయించి ప్రభుత్వ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయం: ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, జూన్ 30 : రైతులకు ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం కట్టంగూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు రెడ్డిపల్లి సాగర్, బెజవాడ సైదులు, దార భిక్షం, బూరుగు శ్రీను, వల్లపు శినివాస్‌రెడ్డి, రెడ్డిపల్లి వీరస్వామి, బండారు కృష్ణ, పెద్ది రవి, చింతల రవీందర్ రెడ్డి, కాపుగంటి నరేశ్, ఆకుల కృష్ణ, బండారు ఆనంద్, దండెంపల్లి వెంకన్న, కొంపెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు లింగం గౌడ్

మర్రిగూడ, జూన్ 30: ఆసరా పెన్షన్ లబ్ధిదారులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెర్కు లింగం గౌడ్ విమర్శించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాగా నే వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేల ఇస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు నోరు విప్పడం లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణ మే హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశా రు. పింఛన్‌దారులకు మద్దతుగా బీఆర్ఎస్ తరుపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.